క్లుప్తంగా

విశేషంగా అప్పన్న నిత్యకల్యాణం



అప్పన్న కల్యాణ ఉత్సవమూర్తులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి,భూదేవిలను కల్యాణమండపం లోని వేదికపై అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం , జీలకర్రబెల్లం, మాంగల్యధారణ,తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

పరవాడ: పరవాడ, వాడచీపురుపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ లైన్ల నిర్వహణ, మరమ్మతులుచేపట్టనున్న నేపథ్యంలో గురువారం ఉదయం 9 గంటల మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఈపీఎల్‌డీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఫలితంగా మండలంలో వాడచీపురుపల్లి, నాయుడుపాలెం, తిక్కవానిపాలెం, ముత్యాలమ్మపాలెం, దలాయిపాలెం, దోసూరు, నునపర్తి, రావాడ, పరవాడ, భర్నికం, తానాం, ఈ.బోనంగి, పి.బోనంగి, ఇండస్ట్రియల్ పార్కు, దేశపాత్రునిపాలెం,జాజులవానిపాలెం, కలపాక, వెన్నలపాలెం గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండబోదని పేర్కొన్నారు.

రేపు సబ్బవరం సెక్షన్–1 పరిధిలో..

సబ్బవరం: మండలంలోని సబ్బవరం సెక్షన్–1 పరిధిలోని గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని ఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్. రామకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలియజేసారు. ఆరోజు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన



గ్యాస్ ప్రమాదాలపై గంగిరెడ్ల కాలనీ వాసులకు అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

సబ్బవరం: అగ్నిప్రమాదాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా వ్యవహరించాలని సబ్బవరం అగ్నిమాపక అధికారి జీవీ సత్యరాజు సూచించారు.మండలంలోని బుడగజంగాల కాలనీ,రెల్లి కాలనీల్లో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు.వంట చేస్తున్నప్పుడు గ్యాస్ లీకై అగ్నిప్రమాదాలు జరిగితే ఏవిధంగా నివారించాలి, విద్యుత్ ఉపకరణాలు వినియోగిస్తున్నప్పుడు అగ్నిప్రమాదాలు జరిగితే తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది కె. అప్పలనాయుడు, పి. అప్పారావు, టి. వెంకటరావు, బి. ఉదయ్ కుమార్, బెన్హర్ తదితరులు పాల్గొన్నారు.

అవకాశం ఇవ్వండి



ప్రచారం నిర్వహిస్తున్న శ్రీకాంత్

దాబాగార్డెన్స్: జై భారత్‌నేషన్ పార్టీ పెందుర్తి నియోజకవర్గ అభ్యర్థి కన్నెపల్లి మహదేవ్ కల్యాణ్ శ్రీకాంత్ బుధవారం పలు ప్రాంతాల్లో ప్రచారం చేశారు. తనను గెలిపిస్తే పేదరిక నిర్మూలనకు కృషి చేస్తానన్నారు. టార్చ్‌లైట్ గుర్తుకు ఓటేయాలని అభ్యర్థించారు.

పక్షులకు తాగునీరు

ఆరిలోవ: పక్షులు, పశువులకు తాగునీటిని అందించడానికి విశాఖ మరియా మేక్స్, గ్రీన్ క్లైమేట్ బృందం ఆధ్వర్యంలో బుధవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. చెట్లు, మొక్కల నీడలో వెడల్పాయిన మట్టి పాత్రలు ఏర్పాటు చేసి వాటిలో నీరు పోశారు.

నేత్ర పర్వం .. సీతారాముల కల్యాణం

- పల్లకిలో ఊరేగిన జానకీరాములు
- వాడవాడలా ఘనంగా శ్రీరామనవమి వేడుకలు
- విశేష పూజలు.. అన్నసమారాధనలు

ఆ కల్యాణం వైభోగం..ఆ వేడుక కమనీయం ..ఆ మధుర ఘట్టం అద్వితీయం..ఆ సంబరం జగమంతా..సీతారాముల కల్యాణం కనులారా చూసినవారికి పుణ్యఫలం కొండంత..జానకి రాముల పెళ్లిలో ప్రతీ ఘట్టం మంత్రముగ్ధం..నిండైన పట్టు వస్త్రాలు, స్వర్ణాభరణాలతో పీటలపై ఆశీనులైన ఆ ఆదర్శదంపతులను చూడడం నయనానందకరం..భక్తజనం సాక్షిగా కోదండరాముడు సీతమ్మవారిని మనువాడాడు..ముత్యాల తలంబ్రాలు తలపై పోసుకుని దంపతులు సందడి చేశారు.. జానకి సమేతంగా జగదభిరాముడు విను వీధుల్లో పల్లకిపై ఊరేగాడు..తమ పెళ్లికి వచ్చిన వారందరికీ విందు భోజనం పెట్టి మనసారా ఆశీస్సులు అందజేశారు.



కోట్నివానిపాలెం కల్యాణంలో పాల్గొన్న భక్తులు

పెందుర్తి: శ్రీరామనవమి వేడుకలు పెందుర్తి నియోజకవర్గంలో బుధవారం ఘనంగా జరిగాయి. వాడవాడలా సీతారాముల కల్యాణం అత్యంత వైభవంగా జరిగింది. పలుచోట్ల అన్నసమారాధనలు నిర్వహించారు. శాంతినగర్ సీతారామాలయంలో 13వ వార్షిక కల్యాణోత్సవాలు వైభవంగా జరిపారు. మధ్యాహ్నం నిర్వహించిన అన్న సమారాధనలో సుమారు ఐదు వేలమంది భక్తులు అన్న ప్రసాదం స్వీకరించారు. శ్రీశారదాపీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి స్వామీజీ వేడుకలో పాల్గొని సీతారాములకు ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్, కార్పొరేటర్ ముమ్మన దేముడు కల్యాణంలో పాల్గొన్నారు.

- వెంకటాద్రి సమీపంలోని ఆంజనేయస్వామి ఆలయంలో సీతారాముల కల్యాణం ఘనంగా జరిపారు.
- సుజాతనగర్‌లోని అయ్యప్పస్వామి దేవాలయ ప్రాంగణంలోని ఆంజనేయస్వామి ఆలయంలో సీతారాముల కల్యాణం వైభవంగా జరిపారు. అన్న ప్రసాద వితరణ చేపట్టారు.
- పెందుర్తి పాతూరులో సీతారాముల కల్యాణం అనంతరం సాయంత్రం పల్లకి ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. పార్వతీనగర్‌లో సీతారాముల కల్యాణం ఘనంగా నిర్వహించారు.
- రాంపురంలో కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ప్రముఖ వ్యాపారవేత్త, సమాజసేవకుడు



98వవార్డు వరాహ లక్ష్మీనృసింహస్వామి వీధిలో సీతారాముల కల్యాణోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

అన్నంరెడ్డి సత్యనారాయణ ఆధ్వర్యంలో భారీ అన్న సమారాధన జరిగింది. పూజల్లో ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్, సర్పంచ్ అన్నంరెడ్డి శిరీష, వేలాదిగా భక్తులు పాల్గొన్నారు.

- వేపగుంట రామాలయంలో కల్యాణం అనంతరం భారీ అన్నసమారాధన జరిగింది.
- కోట్నివానిపాలెంలో శ్రీరామనవమి వేడుకలు ఘనంగా జరిగాయి. సీతారాముల కల్యాణం అనంతరం భారీ అన్నసమారాధన నిర్వహించారు.
- పినగాడిలో నిర్వహించిన సీతారాముల కల్యాణంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బయిలపూడి భగవాన్‌జయరామ్, సర్పంచ్ బయిలపూడి వెంకటలక్ష్మి దంపతులు పాల్గొన్నారు.
- చీమలాపల్లి కోదండరాముని ఆయలంలో సీతారాముల కల్యాణం వైభవంగా జరిగింది.

అంతా రామమయం

సింహాచలం: శ్రీ రామనవమి వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. జగదభిరాముడి కల్యాణాన్ని నేత్ర పర్వంగా నిర్వహించారు. రాములోరి కల్యాణాన్ని భక్తులు కనులారా తిలకించి పులకించి పోయారు. పురస్కరించుకుని సింహగిరిపై ఉన్న పురాతన రామాలయంలో బుధవారం సీతారాముల కల్యాణోత్సవం కనులపండువగా జరిగింది. సీతారామలక్ష్మణ సమేత ఆంజనేయస్వామివారి ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి ఆలయ ప్రాంగణంలోని వేదికపై అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం వైభవంగా నిర్వహించారు. భక్తులకు స్వామివారి కల్యాణ అక్షింతలు, ప్రసాదం అందజేశారు. స్థానాచార్యులు టీ.పి.రాజగోపాల్, ప్రధానార్చకుడు ఇరగవరపు రమణాచార్యులు,అర్చకులు పవన్ తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు. దేవస్థానం ఏఈవో ఎన్.ఆనంద్‌కుమార్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.



సింహపురికాలనీలో స్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్

- సింహగిరిపై కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని సీతారాముల సన్నిధిలో కల్యాణం విశేషంగా నిర్వహించారు. సింహాచలం దేవస్థానం సూపరింటెండెంట్ పిల్లా శ్రీనివాసరావు పాల్గొన్నారు.
- 98వవార్డు సింహపురికాలనీలోని రామాలయంలో సీతారాముల కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. సింహపురికాలనీ, సింహపురి లేఅవుట్ నుంచి పెద్ద ఎత్తున నివాసితులు, భక్తులు తరలివచ్చి కల్యాణోత్సవాన్ని తిలకించారు. పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ స్వామిని దర్శించుకున్నారు. వైఎస్సార్‌సీపీ 98వవార్డు నాయకులు పీతల విష్ణుమూర్తి, నడింపల్లి రామరాజు తదితరులు పాల్గొన్నారు.
- 98వవార్డు పరిధి శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి వీధిలో సీతారాముల కల్యాణం ఘనంగా నిర్వహించారు. భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు స్వామిని దర్శించుకున్నారు. 98వవార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి ఎర్ర వరహానరసింహం, వరాహ లక్ష్మీనృసింహస్వామి వీధి అసోసియేషన్ నాయకులు ప్రసాద్ పాల్గొన్నారు.అలాగే చాకిరేవుకొండలో జరిగిన సీతారాముల కల్యాణోత్సవంలో ముత్తంశెట్టి శ్రీనివాసరావు పాల్గొని స్వామిని దర్శించుకున్నారు.
- అడవివరంలోని బ్రాహ్మణవీధి రామాలయంలో సీతారాముల కల్యాణోత్సవం ఘనంగా జరిగింది. మధ్యాహ్నం పెద్ద ఎత్తున అన్నసమారాధన నిర్వహించారు. సింహాచలం దేవస్థానం మాజీ ట్రస్ట్ బోర్డు సభ్యుడు గంట్ల శ్రీనుబాబు దంపతులు కల్యాణోత్సవంలో పాల్గొన్నారు.

పరవాడ మండలంలో..

పరవాడ: పరవాడలో సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఎంపీపీ పైల వెంకటపద్మ లక్ష్మీశ్రీనివాసరావు దర్శించుకొని ప్రత్యేక పూజలు జరిపారు. సీతారాముల కల్యాణ మహోత్సవంలో జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రామునాయుడు, సర్పంచ్ సిరపరపు అప్పలనాయుడు, ఉప సర్పంచ్ బండారు రామారావు, మాజీ సర్పంచ్ పైల అప్పారావు, నాయకులు చల్లా కనకారావు, పైల హరీష్, అయ్యబాబు పాల్గొన్నారు.



శాంతినగర్: కల్యాణంలో పాల్గొన్న శారదాపీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి



శాంతినగర్‌లో కల్యాణం తిలకిస్తున్న భక్తులు



సింహగిరిపై కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

- వాడచీపురుపల్లిలో సీతారాముల కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. 14 గ్రామాల భక్తులు తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. మాజీ ఎంపీపీ మాసవరపు అప్పలనాయుడు, మాజీ ఎంపీటీసీ కూండ్రపు శ్రీరామ్మూర్తి దంపతులు ప్రత్యేక పూజలు చేసి ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో కూండ్రపు శ్రీను, మధు పాల్గొన్నారు.
- నాయుడుపాలెం శివారు హనుమాన్‌నగర్, సమ్మెంగపాలెం, జాలరిపేట మంగప్పయ్యగారి గ్రామం, కోరంగివానిపాలెం గ్రామాల్లోని అభయాంజనేయస్వామి ఆలయాల్లో శ్రీరామనవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్వామివారిని నాయుడుపాలెం సర్పంచ్ కె.వరలక్ష్మీసీతారామయ్య, కూండ్రపు అప్పలనాయుడు, కూండ్రపు మధు, ఆలయ కమిటీ అధ్యక్షుడు లాలం అప్పలనాయుడు, కార్యదర్శి ఎస్.సోమేశ్వరరావు భారీ అన్న సమారాధనను ప్రారంభించారు.
- కన్నూరు, పెదముషిడివాడ, లంకెలపాలెం, పి.బోనంగి, గొర్లివానిపాలెం, భర్నికం, తానాం, తాడి, ధర్మారాయుడుపేట, వెన్నలపాలెం, దలాయిపాలెం గ్రామాల్లో శ్రీరామనవమి వేడుకలను వైభవంగా నిర్వహించారు.



సీతారాముల కల్యాణ ఉత్సవమూర్తులు



వెంకటాద్రి సమీపంలోని ఆంజనేయస్వామి దేవాలయంలో సీతారాముల కల్యాణం



సింహగిరిపై పురాతన రామాలయంలో జీలకర్రబెల్లం ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సబ్బవరం మండలంలో..

సబ్బవరం: మండలంలోని ప్రతి గ్రామంలో శ్రీరామ నవమి వేడుకలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. సీతారాముల కల్యాణంలో దంపతులు పాల్గొన్నారు. ఆలయాల్లో అన్న సమారాధనలు నిర్వహించారు.



బంగారమ్మపాలెంలో నిర్వహించిన కల్యాణంలో పాల్గొన్న భక్తులు



వంగలిలో రామాలయంలో పూజలు



సీతారాములను దర్శించుకున్న ఎంపీపీ వెంకటపద్మలక్ష్మిశ్రీనివాసరావు



అడవివరం బ్రాహ్మణవీధిలో రాములోరి కల్యాణోత్సవం



హనుమాన్‌నగర్ అభయాంజనేయ ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న భక్తులు



పరవాడలో సీతారాముల కల్యాణ మహోత్సవం తిలకిస్తున్న భక్తులు



కల్యాణ మహోత్సవంలో పూజలు నిర్వహిస్తున్న సర్పంచ్ అప్పలనాయుడు దంపతులు



హనుమాన్‌నగర్‌లో ఆంజనేయ స్వామిని దర్శించుకున్న భక్తులు


ముగిసిన లలితాంబిక నవరాత్రి ఉత్సవాలు

సబ్బవరం: ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం దేవీపురంలోని సహస్రాక్షి రాజరాజేశ్వరీదేవి ఆరాధన పీఠంలో నిర్వహిస్తున్న లలితాంబిక నవరాత్రి ఉత్సవాలు బుధవారంతో ఘనంగా ముగిశాయి. నవరాత్రి వేడుకల్లో చివరిరోజు లలితాంబిక అమ్మవారు లలితా మహా త్రిపుర సుందరి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి సన్నిధిలో విశేష హోమం,లలితా సహస్రనామ హవనము విశేషంగా జరిగాయి. శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా శ్రీరామ మూలమంత్ర హవనం నిర్వహించారు. అమ్మవారి సన్నిధిలో అభిషేకానంతరం సహస్ర శ్రీలలితా సహస్ర నామావళి సామూహిక కుంకమ పూజలు భక్తిశ్రద్ధలతో చేశారు. సాయంత్రం నిర్వహించిన అమ్మవారి రథయాత్రలో గురుమాత అన్నపూర్ణతో పాటు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని కనుల పండువగా నిర్వహించారు.



లలితా మహాత్రిపుర సుందరిగా లలితాంబిక

బొర్రమాంబ పుట్టబంగారు మహోత్సవం నేడు



బొర్రమాంబ తల్లి

అగనంపూడి: అగనంపూడి పరిసర ఎనిమిది గ్రామాల ప్రజల ఆరాధ్యదైవం బొర్రమాంబ అమ్మవారి జాతర ఉత్సవాల్లో భాగంగా గురువారం పుట్ట బంగారు మహోత్సవం జరిపించేందుకు ఆలయ కమిటీ ఏర్పాట్లు చేసింది. గ్రామంలోని అమ్మవారి దగ్గరి నుంచి వనం వరకు భారీ ఊరేగింపుతో ఈ ఉత్సవం నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ చైర్మన్ చిత్తా గణేష్ తెలిపారు.

ప్రగతి మార్గం

పెందుర్తి: జీవీఎంసీ 95వ వార్డు పాపయ్యరాజుపాలెం భవానీనగర్–లక్ష్మీపురం రహదారి శిథిలమైనా నాటి టీడీపీ పాలకులు పట్టించుకోలేదు. ఆరేడు గ్రామాలను అనుసంధానం చేసే రోడ్డును అభివృద్ధి చేయాలన్న ఆలోచన రాలేదు. ఫలితంగా వర్షాకాలం చెరువును తలపించే ఈ రోడ్డుతో వాహనదారులకు నరకం కనిపించింది. అయినా పట్టించుకున్న పాపాన పోలేదు. క్రమేనా రహదారి పూర్తిగా కోతకు గురైంది. ఈ రహదారిలో ప్రయాణం అంటే భయపడే దుస్థితి వచ్చింది.

నేడు: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జీవీఎంపీ పాలకవర్గం ఏర్పడి ఏడాదిలో రూ.1 కోటి విడుదల చేసిన జీవీఎంసీ వెనువెంటనే పనులు ప్రారంభించింది. దాదాపు 2.5 కిలో మీటర్ల రాచమార్గం నిర్మించింది. ప్రస్తుతం ఈ ప్రాంతానికి చెందిన ప్రజలు హాయిగా రాకపోకలు సాగిస్తున్నారు.

అప్పుడు ప్రయాణం నరకమే

పాపయ్యరాజుపాలెం భవానీనగర్–లక్ష్మీపురం రహదారి దాదాపు ఆరేడు గ్రామాలను కలుపుతుంది. పాపయ్యరాజుపాలెం, భవానీనగర్, పోర్టు కాలనీ, లక్ష్మీపురం, చీమలాపల్లి, పార్లపాలెం, చింతలగ్రహారం, గవరపాలెం ప్రాంతాల ప్రజలు పెందుర్తి రావడానికి ఇది దగ్గర మార్గం. అయితే ఈ రహదారి టీడీపీ ప్రభుత్వ హయాంలో పూర్తిగా నిర్లక్ష్యానికి గురైంది. రోడ్డు పూర్తిగా గోతులమయం అయి ప్రజలు కనీసం నడిచి వెళ్లేందుకు కూడా పనికిరాకుండా ఉండేది. ఈ రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు అనేక సార్లు అప్పటి ప్రజాప్రతినిధులకు విన్నవించినా ఫలితం లేకుండా పోయింది.



నాడు: అధ్వానంగా భవానీనగర్-లక్ష్మీపురం రహదారి



నేడు: సుందరంగా పాపయ్యరాజుపాలెం భవానీనగర్-లక్ష్మీపురం రహదారి

ఇప్పుడు సజావుగా సవారీ

ఐదేళ్ల పాలనలో టీడీపీ ప్రభుత్వం ఈ రహదారిని గాలికి వదిలేస్తే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రహదారి నిర్మాణానికి నడుం బిగించింది. జీవీఎంసీ పాలకవర్గం ఏర్పడి వెంటనే ఈ రహదారి నిర్మాణానికి ప్రజాప్రతినిధుల చొరవతో రూ.కోటి నిధులు మంజూరయ్యాయి. వెంటనే పనులు ప్రారంభం కావడంతో తాజాగా రోడ్డు నిర్మాణం పూర్తయింది. ప్రస్తుతం ఈ రహదారిపై ప్రజలు హాయిగా ప్రయాణం చేస్తున్నారు.

నేటి నుంచి నామినేషన్ల స్వీకరణ

పెందుర్తి: సార్వత్రిక ఎన్నికల సంగ్రామంలో నామినేషన్ల ఘట్టానికి గురువారం నుంచి తెరలేవనుంది. పెందుర్తి రెవెన్యూ కార్యాలయం సమీపంలోని రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో ఈ నెల 25 వరకు అభ్యర్థుల నుంచి నామినేషన్లు స్వీకరించనున్నారు. ఆయా ఏర్పాట్లను రిటర్నింగ్ అధికారి శేష శైలజ బుధవారం సమీక్షించారు. నామినేషన్ల ప్రక్రియ కోసం పటిష్టమైన ఏర్పాట్లు చేసినట్లు ఆమె తెలిపారు. నామినేషన్లు వేసే అభ్యర్థితో పాటు ఐదుగురికి మాత్రమే కార్యాలయంలోనికి ప్రవేశం ఉంటుందన్నారు. నామినేషన్లు ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల మధ్యలో స్వీకరిస్తామని చెప్పారు. ఆర్వో కార్యాలయానికి 100 మీటర్ల దూరంలోనే అభ్యర్థుల మద్దతుదారులు, వాహనాలు నిలిపేస్తామని చెప్పారు. ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు 144 సెక్షన్ అమల్లో ఉంటుందని తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తుతో పాటు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు.



పెందుర్తిలో రిటర్నింగ్ అధికారి కార్యాలయం

కార్మికుల పోరాటం స్ఫూర్తిదాయకం

కూర్మన్నపాలెం: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కార్మికులు చేస్తున్న పోరాటం స్ఫూర్తిదాయకమని విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు పేర్కొన్నారు. ఇంతటి సుదీర్ఘ పోరాటం చేస్తున్న ఘనత 'ఉక్కు' కార్మికులకే చెందుతుందన్నారు. కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షల్లో 1161వ రోజు, బుధవారం సంస్థలోని పలు విభాగాల కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మికుల జీవితాలతో చెలగాటం ఆడుతోందన్నారు. విశాఖ ఉక్కు దీక్షను స్ఫూర్తిగా తీసుకుని దేశవ్యాప్తంగా కార్మికవర్గం ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడాలన్నారు. ప్లాంట్‌లోఉత్పత్తిని పెంచాలన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న పోరాట కమిటీ నాయకులు